‘చెత్త’ వీధులు

కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు

● పట్టించుకోని పారిశుద్ధ్య విభాగం ● విష జ్వరాలతో ఆసుపత్రి పాలవుతున్న ప్రజలు ● పత్తాలేని వైద్య ఆరోగ్య అధికారులు



షాపూర్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇలా..

కాలనీల్లో చెత్త పేరుకుపోవడంతో కాలనీల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీధుల్లోని ప్రధాన రోడ్లు చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులతో ఇప్పటికే ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించడం లేదని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కనీసం వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయడం లేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



జీడిమెట్ల ఫేజ్ -2 ఇండస్ట్రియల్ ప్రాంతంలో..



నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప వద్ద పేరుకుపోయిన చెత్త



గాంధీ నగర్‌లో రోడ్డు పక్కనే ఇలా...

కుత్బుల్లాపూర్ : జంట సర్కిళ్ల పరిధిలోని వీధులు చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. ఒకవైపు మూడు రోజులుగా వానలు.. మరోవైపు కాలు బయట పెట్టనివ్వని చెత్తకుప్పలతో కుత్బుల్లాపూర్, గాజులరామారం ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దుర్గంధ పూరిత వాతావరణంలో ప్రజలు ఇబ్బందులు పడుతూ అంటురోగాల బారిన పడుతున్నారు. ఒక వైపు డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు సోకి ప్రజలు ఆసుపత్రుల పాలవుతుంటే పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది చేతులెత్తేశారు. ఈ రెండు సర్కిళ్ల ప్రజలు సుమారు 16 లక్షల పైగానే ఉన్నప్పటికీ అందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో చెత్తాచెదారాలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి.ఒకవైపు డంపర్ బిన్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ ప్రధాన కాలనీల రోడ్లపై చెత్తాచెదారాలు పడి ఉండటం విశేషం. రెండు సర్కిళ్ల పరిధిలో సుమారు 60 శాతం జనాభా మురికివాడ ప్రాంతాల్లోనే నివాసం ఉంటున్నారు. వీరికి ఎటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతిరోజు ఆసుపత్రుల పాలవుతున్న వారి సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతుంది.

విష జ్వరాలు.. పట్టించుకోని అధికారులు

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రజలు విష జ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. వర్షాకాలానికి ముందు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన వైద్య శాఖ అధికారులు ఆ వైపు కృషి చేయడం లేదు. కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయకపోవడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని చెప్పవచ్చు. పలు ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఇప్పటికే పదుల సంఖ్యలో డెంగీ సోకి చికిత్స పొందుతున్న వారు వెలుగులోకి వచ్చినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం అది తమ పరిధి కాదు..! అన్నట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అప్రమత్తమై మురికివాడ ప్రాంతాల్లో నివసించే ప్రజలపై దృష్టి సారించాలని కోరుతున్నారు. వీధుల్లోని చెత్తకుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

బస్సులు పెంచాలని మంత్రికి వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: ఆర్టీసీ బస్సులు పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సర్వీసులతో మహిళలు లబ్ధి పొందుతున్నారని, సరిపడా బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్సు సర్వీసులను పెంచి మహిళలు పడుతున్న ఇక్కట్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నవీన్, శ్యాం, వజ్రమణి తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే సమాచారం ఇవ్వాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లేశ్

జీడిమెట్ల: చిన్నారులను ఎవరైనా లైంగికంగా వేధిస్తే తల్లిదండ్రులు, గురువులు, పోలీసుల్లో ఎవరికైనా సమాచారం ఇవ్వాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల్లో సైతం వారి స్నేహితుల్లో ఎవరైనా ఒంటరిగా బాధపడుతూ కనిపిస్తే ఉపాధ్యాయులకు వివరించాలని సూచించారు. బాలురు సైతం బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించకుండా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కమల్‌సింగ్, ఎస్‌ఐలు హరీశ్, ఆంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: దాడికి కారణమైన కేఎల్‌ఎం యూనివర్సిటీ యాజమాన్యంపై హత్యాయత్నం కేస్ నమోదు చెయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సూరారం పోలీస్ ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వారం గాజులరామరం డివిజన్ లాలసాహెబ్ గూడకు చెందిన దారం నర్సింగరావుపై కేఎల్‌ఎం యూనివర్సిటీ సిబ్బంది దాడి చేయడంతో గాయపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ నాయకులు చంద్రమోహన్, బాలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న వినోద్, స్వామిగౌడ్, లక్ష్మీనాథ్ తదితరులు

రంగారెడ్డినగర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వడం అభినందనీయమని గాంధీనగర్ ఐలా అధ్యక్షుడు, పవర్ టెక్ ట్రాన్స్‌ఫార్మర్స్ అధినేత పైడిపల్లి స్వామిగౌడ్ అన్నారు. సంఘ సేవకులు వి.వి.ఈ ట్రాన్స్‌ఫార్మర్స్ అధినేత ఈళ్ల వినోద్ తన తండ్రి దివంగత ఈళ్ల నారాయణరావు జ్ఞాపకార్థం మంగళవారం గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మీనాథ్, వి.వి.ఈ ట్రాన్స్‌ఫార్మర్స్ ప్రతినిధి వెంకటేశ్వర్ రావు, నాయకులు తిమ్మయ్య, జగన్, రాంచందర్, శ్రీను, సందీప్, సాయి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీల ప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వివిధ సమస్యలపై విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులు జరిగేలా కృషి చేస్తానని శ్రీశైలంగౌడ్ హామీ ఇచ్చారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు లాభం చేకూరేలా లేదని, తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. విశ్వ నగరంగా పేరు గాంచిన హైదరాబాద్‌కు బడ్జెట్‌లో ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై చిన్న చూపు చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరు ఫెడరల్ వ్యవస్థకి తూట్లు పొడిచేలా ఉందని, బడ్జెట్ ద్వారా ఈ విషయం తేటతెల్లం అయ్యిందన్నారు.

26న వాహనాల వేలం పాట

కుత్బుల్లాపూర్: మద్యం అక్రమ రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం పాటను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ యాదయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అశోక్‌లైలాండ్ కంటైనర్ (ఎంహెచ్ 01ఇఇ 1182) ప్రభుత్వ ధరను రూ.19,15,000, హుండాయ్ ఎవెన్యూ కారు (టీఎస్08జీఎం 6841) ధరను రూ.4,10,000, హోండా యాక్టీవా (ఏపీ 28 బీకే 5124) ధరను రూ. 6,500 గా నిర్ణయించామని తెలిపారు. ఈ నెల 26వ తేది ఉదయం 11 గంటలకు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగే వేలం పాటలో పాల్గొనదలిచే వారు వాహన ధరకు 50 శాతం ముందుగా చెల్లించాల్సి ఉంటుందని సీఐ పేర్కొన్నారు.

బీజేపీ నుంచి కృష్ణ సస్పెన్షన్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి గొల్ల కృష్ణను ఆ పార్టీ సస్పెండ్ చేసింది. మంగళవారం మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అంతర్గత విషయాలపై, నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా సోషల్ మీడియాలో వ్యతిరేక పోస్టులు పెట్టడం వల్ల సస్పెండ్ చేసినట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ తెలిపారు.

అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలి

చింతల్: అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని సిటిజన్ ఫస్ట్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ సౌత్ జోన్ చైర్‌పర్సన్ శాలిని జాదవ్ అన్నారు. మంగళవారం చింతల్ భాగ్యరథి డిగ్రీ కళాశాలలో సామాజిక అవగాహన, పరిశుభ్రత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాత్రివేళలో ప్రయాణించాల్సి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సోషల్ మీడియాను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో క్రియాశీల సభ్యుడు మోహన్‌రావు మిర్తిపాటి, కళాశాల ప్రిన్సిపాల్ చల్ల గోవిందరెడ్డి, డైరెక్టర్ నల్ల జైశంకర్ గౌడ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడే వారికి సరైన గౌరవం



మేడ్చల్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డితో బీజేపీ నాయకులు

జీడిమెట్ల: బీజేపీ పార్టీలో కష్టపడే వారికి సరైన గౌరవం దక్కుతుందని పార్టీ జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన గొట్టిముక్కల సత్యనారాయణ రాజు మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, మాజీ కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్.వాసు బీజేపీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వెంకటపతిరాజు, గణేష్, తాతాజీ, సంతోష్, సీహెచ్ నాగరాజు, నరసింహ, చిన్నబాబు, సురేష్, విజయ్, నాగరాజు, నవీన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు స్పష్టం చేశారు. మంగళవారం సుచిత్ర, పేట్‌బషీరాబాద్, దూలపల్లి చౌరస్తాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న 12 మంది ద్విచక్ర వాహనదారులు, అదే విధంగా నెంబర్ ప్లేట్ సక్రమంగా లేని 10 మంది వాహనదారులకు సీఐ నాగరాజు కౌన్సెలింగ్ ఇచ్చారు.

బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటిన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్ ప్రసూన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన వన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాలనీ వాసులు, సిద్ధార్థ పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు పడి భూగర్భ జలాలు వృద్ధి చెందాలన్నా, కాలుష్యం తగ్గాలన్నా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంపత్, మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్, ఎల్లాగౌడ్, విజయ హరీష్, కాలె గణేష్, సంజీవ్, ప్రసూన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి సిద్ధులు, అసోసియేషన్ సభ్యులు సాగర్ రెడ్డి, సుబ్బారావు, రమేష్, సత్యనారాయణ, నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారణకు బ్లూక్రాస్‌తో కలిసి చర్యలు



కాలనీలో పర్యటిస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్, కమిషనర్ శ్రీహరి

కుత్బుల్లాపూర్: వీధి కుక్కల బెడద నివారణ కోసం బ్లూక్రాస్ సంస్థతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. మంగళవారం కొంపల్లి ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్ శిరీషతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుక్కల బెడదను నివారించడంలో కమిషనర్ విఫలమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. వీధి కుక్కల సమస్యపై తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని, దీనికి అందరూ సహకరించాలన్నారు. కుక్కల బెడదపై రాజకీయం చేయొద్దని ఆయన కోరారు. ఆయన వెంట కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ నూతన ఏఈని నియమించాలి



ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఇరిగేషన్ శాఖ ఏఈగా కొనసాగుతున్న రామారావు స్థానంలో నూతన ఏఈని నియమించాలని మంగళవారం బీజేపీ నాయకులు ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. లింగం చెరువు, చిన్న బంధం కుంట, పంతులు కుంట, మహబూబ్ కుంట, పెద్ద చెరువు, బంధం కుంట, చింతలచెరువు, మధ్యల చెరువు, కాలమన కుంట, వడ్డవానికుంట ఆక్రమణలకు గురయ్యాయని వివరించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారుల అలసత్వంతోనే చెరువులు కబ్జా చెరలో చిక్కుకున్నాయన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మురళీ, అరుణ్ రావు, మాధవరావు, ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తవ్విన రోడ్డును పునరుద్ధరించాలి



రోడ్డును పరిశీలిస్తున్న కౌన్సిలర్లు కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్: అభివృద్ధి పనుల్లో తవ్విన రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్‌లో ఇటీవల మిషన్ భగీరథ పైపులైన్ పనుల్లో భాగంగా తవ్వకాలు చేపట్టిన రోడ్డును అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బౌరంపేట్‌లోని మల్లన్న ఆలయం నుంచి డీపీఎస్ స్కూల్ వరకు నూతన రోడ్డును వేయాలని ప్రతిపాదించగా కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ సౌమ్య, ఏఈ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, సురేందర్ రెడ్డి, మురళీయాదవ్, కృష్ణారెడ్డి, జీవన్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డీసీ ఆదేశం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో గాజులరామారం సర్కిల్ డీసీ మల్లారెడ్డి మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. జగద్గిరిగుట్టలోని పలు సమస్యలపై సోమవారం ప్రజావాణిలో బీజేపీ నాయకుడు జేకే శేఖర్ యాదవ్ ఫిర్యాదు చేయడంతో మంగళవారం బీరప్ప నగర్, దేవమ్మ బస్తీ, పాపిరెడ్డి నగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, శానిటేషన్ సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కృష్ణగౌడ్, సుధాకర్, గండి రాజు యాదవ్, పాపిరెడ్డి, వేణు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన జేసీ



ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న జేసీ విజయేందర్ రెడ్డి

కుత్బుల్లాపూర్ : పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/1, 25/2లలో ఉన్న ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆర్డీఓ శ్యాం ప్రకాష్, తహసీల్దార్ రెహమాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుకాదేవి, సర్వేయర్‌తో కలిసి పరిశీలించారు. రంగారెడ్డి బండ, యాదిరెడ్డి బండ ప్రాంతాల్లో ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలతో పాటు ఖాళీగా ఉన్న స్థలాలను పరిశీలించి, వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కూలిన గోడను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శేషగిరి

సుభాష్‌నగర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. ఉమాదేవినగర్‌లో ఇటీవల కురిసిన వర్షానికి పాఠశాల, హనుమాన్ ఆలయానికి మధ్య ఉన్న ప్రహరీ కూలిపోయింది. మంగళవారం బస్తీ వాసులతో కలిసి గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులతో మాట్లాడి గోడను పునర్నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో సమ్మన్న, కృష్ణమూర్తి, కరుణాకర్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐ నరసింహరాజు

కుత్బుల్లాపూర్: శుభకార్యాలకు ఫంక్షన్ హాళ్లను అద్దెకు ఇచ్చే విషయంలో నిర్వాహకులు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పేట్‌బషీరాబాద్ డీఐ నరసింహరాజు అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలు ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫంక్షన్ హాళ్లల్లో సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పార్కింగ్ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఈవెంట్, సౌండ్‌సిస్టం, డ్రోన్‌ల వినియోగంపై అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే ఫంక్షన్ హాళ్ల అనుమతులను రద్దు చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు

దుండిగల్: అర్హులైన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయాలని బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం టీఎస్‌జీఏబీ చైర్మన్ రవీందర్‌రావు, టీఎస్‌సీఏబీ చీఫ్ జనరల్ మేనేజర్ జ్యోతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులు ఉండగా.. కేవలం 11 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా వారికి కూడా రుణమాఫీ అయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ నల్లూరి కృష్ణ, సెక్రటరీ సయ్యద్ అసదుల్లా, ఈదులకంటి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు సరికాదు

సుభాష్‌నగర్: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్ ఖండించారు. మంగళవారం సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల చట్టం 2016ను అనుసరించి చేయగలిగిన పోస్టులలో దివ్యాంగుల సర్వీస్‌ను ఉపయోగించుకోవాలని స్పష్టంగా ఉందన్నారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు ఆమెకున్న జ్ఞానాన్ని తెలియజేస్తుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో యాదయ్య, దేవమణి, నరేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, ఆంజనేయులు, ప్రకాష్, వెంకటరామయ్య పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు